





మంచు మనోహరం

ఉదయం తొమ్మిది గంటలైనా మంచు దుప్పటి వీడలేదు. నాలుగైదు అడుగుల దూరంలో ఉన్న మనుషులు సైతం కనిపించని పరిస్థితి. దీంతో వాహనదారులు లైట్ల సాయంతోనే ప్రయాణాలు సాగించారు. పూడూరు మండలం కంకల్ గ్రామంలో గురువారం ఉదయం దర్శనమిచ్చిన మంచుతెరలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించిది. -ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

ప్రగతికి రథచక్రం ఆర్టీసీ

» శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



యూనిఫాం పంపిణీ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రగతికి రథచక్రం ఆర్టీసీ అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజాపాలన- ప్రజా విజయోత్సవ కార్యక్రమాన్ని గురువారం వికారాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 114 కోట్ల మంది మహిళలు, జిల్లాలో డిపోల పరిధిలో ఇప్పటి వరకు 2.33కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. వికారాబాద్ డిపోకు కొత్తగా ఆరు బస్సులు మంజూరు చేశామన్నారు. బస్టాండ్‌లో కనీస సౌకర్యాలకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, డిపో మేనేజర్ అరుణ, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులు భాగస్వాములు కావాలి

దివ్యాంగులు మిగిలిన వారితో సమానులని, వారు అన్ని రంగాల్లో భాగస్వాములు కావాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మద్గుల్ చిట్టంపల్లిలోని డీపీఆర్సీ భవనంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫాం పంపిణీ చేశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల హక్కులు రక్షించడంతోపాటు వారికి సమాజంలో ప్రత్యేక స్థానం కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ముఖ్తార్, శంసాద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

'మోమిన్‌పేట్' అభివృద్ధికి కృషి

మోమిన్‌పేట్: మండల అభివృద్ధికి కృషి చేస్తానని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఎన్కతల, మొరంగపల్లి, చంద్రయన్‌పల్లి గ్రామాల్లో విద్యుత్ ఉప కేంద్రం, 64 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, 25 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులును పంపిణీ చేశారు. చంద్రయన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు యూనిఫాం పంపిణీ చేశారు. మొరంగపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్నా ఆడించే వారేరీ?



ఆటలకు దూరమవుతున్న ఇంటర్ విద్యార్థులు

పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థుల్లోని క్రియా కౌశలాలను గుర్తించి ప్రోత్సహించేందుకు విద్యాశాఖ పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్ల(పీడీ)ను నియమిస్తోంది. మాధ్యమిక, ఉన్నత స్థాయి వరకు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లు లేక విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. స్కూల్ స్థాయిలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఇంటర్‌లో ఆటలకు దూరమవుతున్నారు. జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలు ఉండగా ఒక్క పీడీ కూడా లేకపోవడం గమనార్హం. ఈ కళాశాలల్లో 3,435 మంది విద్యార్థులు ఉన్నారు.



- జూనియర్ కాలేజీల్లో పీడీలు కరువు
- 13 కళాశాలల్లో ఒక్కరూ లేని వైనం
- 8 కాలేజీలకు పోస్టులే మంజూరు కాలేదు
- పట్టించుకోని జిల్లా విద్యాశాఖ అధికారులు



వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

వికారాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 13,178 మంది విద్యార్థులున్నారు. వీరిలో ప్రైవేట్, గురుకుల, కేజీబీవీ, మోడల్ కళాశాలల్లో 9,748 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,435 మంది విద్యార్థులున్నారు. గురుకుల, మోడల్, కేజీబీవీ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు ఉండగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లు లేక ఇంటర్ విద్యార్థులు క్రీడలకు నోచుకోవడం లేదు. ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజులు చెల్లించలేక ప్రభుత్వ కళాశాలల్లో చదువులను కొనసాగిస్తున్నారు. విద్యార్థులను వివిధ క్రీడాంశాల్లో ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో స్పోర్ట్స్ కోటాను అమలు చేస్తున్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలంటే సరైన శిక్షణ ఇచ్చి వారిని ఉత్తమ

మిగతా 6వ పేజీలో...



సీఎం కప్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా యువజన క్రీడాధికారి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం కప్-2024 పోటీలను నిర్వహిస్తోందని జిల్లా యువజన క్రీడాధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు నాలుగు దశల్లో జరుగుతాయని , జిల్లాలోని యువ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు వేదికగా నిలుస్తాయన్నారు. పంచాయతీ స్థాయి పోటీలు ఈ నెల 7, 8తేదీల్లో జరుగుతాయని ఇందులో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు నిర్వహించి విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ప్రధానం చేస్తారన్నారు. అలాగే మండలాలు, మున్సిపాలిటీల స్థాయి పోటీలు 10, 12తేదీల్లో జరుగుతాయని, ఇందులో గ్రామస్థాయి క్రీడలలో గెలుపొందిన వారికి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల వారు వెబ్‌సైట్‌లో అవసరమైన పత్రాలు, వయస్సు ధ్రువీకరణ పత్రం లేదా 10వ తరగతి మెమో, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

కంది.. బాగుంది!

- సాగుకు అనుకూలించిన వాతావరణం
- అధిక దిగుబడులు వచ్చే అవకాశం
- జిల్లాలో 1.47.788 ఎకరాల్లో సాగు
- పూత,కాత దశలో జాగ్రత్తలు అవసరం

4



కాగితాల్లోనే పార్కులు

- హెచ్ఎండీఏ లే అవుట్లలో అన్యాక్రాంతం
- కమ్యూనిటీ హాళ్లకు, పార్కింగ్‌లకు వినియోగం
- 50 కాలనీల్లో 120 పార్కు స్థలాల గుర్తింపు

5



కనిపించని 'చెత్త'శుద్ధి

- గ్రామాల్లో కానరాని స్వచ్ఛత
- ట్రాక్టర్ల నిర్వహణలో లోపాలు
- నిరుపయోగంగా ఎరువుల తయారీ కేంద్రాలు
- కొడంగల్ మండలంలోని పల్లెల్లో దుస్థితి

6





పెన్షనర్లతో కేంద్ర బృందం ప్రతినిధులు

సంక్షేమ పథకాల అమలుపై ఆరా

» గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

తాండూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కేంద్రబృందం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. ఎంపీడీవో అధికారి హోదాలో ఉన్న పూజ, డీఎల్‌పీవో హోదాలో ఉన్న శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ అధికారులుగా కొనసాగుతున్న జ్యోత్స్న, ఊశయ్యల బృందం తాండూరు మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి సమగ్ర వివరాలు సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా పింఛన్ పథకంపై సమగ్ర వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకు న్నారు. పింఛన్ ప్రతినెలా ఎంత వస్తుంది? నిజమైన లబ్ధిదారులకే అందుతుందా? సకాలంలో అందుతున్నాయా? అనే విషయాలపై పెన్షన్‌దారుల నుంచి వివరాలు సేకరించారు. ముందుగా మండల పరిధిలోని అంతారం, బెల్కటూర్ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను సేకరించిన అనంతరం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విశ్వప్రసాద్ అడిగి లబ్ధిదారులకు సంబంధించిన రికార్డులు, మెయింటెనెన్స్‌కు సంబంధించిన రికార్డులు, ఫైళ్లను పరిశీలించారు. ఎంపీడీవో విశ్వప్రసాద్ మాట్లాడుతూ పింఛన్ పథకంలో లబ్ధిదారులకు ప్రతినెలా కార్యకర్తల చేత పంపిణీ చేస్తున్నట్లు బృందం సభ్యులకు వివరించారు. మరికొందరు లబ్ధిదారులకు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు.

దిశ లేని బతుకులు

ఛిన్నాభిన్నమైన మృతుల కుటుంబాలు.. నేటితో చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్‌కు ఐదేళ్లు

షాద్‌నగర్/మక్తల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏం జరిగిందో తెలియదు... తెల్లారేసరికి వారి కుమారుల పేర్లు, ఫొటోలు మీడియాలో ప్రసారం అవుతున్నాయి... రాత్రి పొద్దు పోయాక వచ్చిన కుమారులు ఇళ్లలోనే ఉన్నారు... పోలీసులు వచ్చి దొరికిన వారిని దొరికినట్లు లాక్కెళ్లారు... రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలో ఓ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేశారని వారిపై ఆరోపణ... దీన్ని అర్థం చేసుకునే స్థితిలో కూడా ఆ కుటుంబాలు లేవు... వారిని ఎన్‌కౌంటర్ చేయాలని రాష్ట్రం మొత్తం కోడై కూసింది.. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న వారిని జన సమూహం చుట్టుముట్టింది. దీనికి మీరేమంటారంటే జవాబు కూడా

మిగతా 5వ పేజీలో...



ఐదేళ్ల క్రితం చటాన్‌పల్లిలో జరిగిన దిశ నిందితుల ఎన్‌కౌంటర్



చింతకుంట కేశవులు తల్లి జయమ్మ, కూతురు చందన

జీవనం దుర్భరంగా మారింది

ఐదేళ్ల క్రితం మా కుమారుడు చెన్న కేశవులును పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో పొట్టన పెట్టుకున్నారు. కుమారుడు చనిపోయిన మూడు నెలలకే నా భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎన్‌కౌంటర్ సమయంలో చెన్నకేశవులు భార్య గర్భవతి. కోడలు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లింది. ప్రస్తుతం ఐదేళ్ల మనవరాలితో ఇంట్లో నివాసం ఉంటున్నాం. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. జీవనం దుర్భరంగా మారింది, ఇప్పటికైనా మా కుటుంబానికి న్యాయం చేయాలి.

-జయమ్మ,చింతకుంట కేశవులు తల్లి

జిల్లాలో నేడు



కొడంగల్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం

కొడంగల్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం, శంకుస్థాపనలు

» ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

కొడంగల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ కేంద్రంలో నేడు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు జరగనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో హరే రామ హరే కృష్ణ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అల్పాహారం అందించే కిచెన్ షెడ్డును మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తదితరులు ప్రారంభించనున్నారు. దీంతో పాటు వర్చువల్‌గా ఒకే దగ్గరి నుంచి నూతన మండలాలైన కొత్తపల్లి, దుద్యాల, గుండుమాల్ మండలాల్లో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా కోస్గి, కొడంగల్ మున్సిపాలిటీల అభివృద్ధికి మంజూరైన రూ.15 కోట్లు, నియోజకవర్గంలోని పాఠశాలల అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ భవనాలకు రూ.20 కోట్లతో శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు సంబంధించి స్థానిక మార్కెట్ యార్డులో ప్రారంభోత్సవ ఏర్పాట్లను కడా అధికారి వెంకటరెడ్డి పరిశీలించారు. మంత్రుల రాకకోసం సభా స్థలాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని కొనసాగించేందుకు వివిధ శాఖల అధికారులు సమాయత్తం అయ్యారు. నియోజకవర్గ కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మొదటి సారిగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు.

కంది.. బాగుంది!

- సాగుకు అనుకూలించిన వాతావరణం
- అధిక దిగుబడులు వచ్చే అవకాశం
- పూత, కాత దశలో జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తల సూచనలు

జిల్లాలో 1,47,788 ఎకరాల్లో సాగు

పరిగి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో అన్నదాతలు వాణిజ్య పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో ప్రధానంగా కంది,పత్తి, పసుపు పంటల సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతోంది. ప్రభుత్వం పప్పు ధాన్యాల సాగును పెంచాలని ప్రోత్సహిస్తుండడంతో కంది సాగు ఈసారి జిల్లాలో అధిక విస్తీర్ణంలో సాగైంది. వర్షాధార పంటగా సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా ఉంది. జిల్లాలో కంది పంట గత ఏడాది 1,04,448 ఎకరాల్లో సాగవగా, ఈసారి 1,47,788 ఎకరాల్లో సాగు చేశారు. తాండూరు కందికి రాష్ట్రంలోనే ప్రసిద్ధి ఉంది. జిల్లాలో అన్ని పంటల్లో పత్తి తర్వాత రెండవ పంట కందినే ఎక్కువగా సాగు చేస్తారు. వాణిజ్య పంటల్లోకెల్లా కంది సాగు లాభదాయకంగా ఉంటుందని చెబుతున్నారు. ఈసారి వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడులతో లాభాలు ఇచ్చే


పరిగి శివారులో ఏపుగా పెరిగిన కంది చేను

అవకాశం ఉంది. పత్తి సాగు పెట్టుబడుల ఖర్చులతో పోలిస్తే కందికి తక్కువ ఖర్చులే ఉంటాయని రైతులు చెబుతున్నారు. దీంతో రైతులు పత్తి కంటే కందిసాగుపై ఎక్కువగా మొగ్గు చూపారు. కంది పంట అంతా ఆశాజనకంగా ఉన్నప్పటికీ పచ్చపురుగు బాధ వచ్చినా ప్రస్తుతం అది కూడా అదుపులో ఉందని రైతులు చెబుతున్నారు. పరిగి, తాండూరు, కొడంగల్, దౌల్తాబాద్; బషీరాబాద్, దోమ, కులకచర్ల, యాలాల, పెద్దేముల్, బొంరాస్‌పేట్ మండలాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ సారి ఎకరా కంది సాగుకు రూ.15వేల నుంచి రూ.20 వేలలోపే పెట్టుబడులు పెట్టారు. పచ్చపురుగు బెడద తగ్గడంతో పెట్టుబడుల వ్యయం కూడా తగ్గిందని చెబుతున్నారు. పురుగుల మందుల పిచికారి కూడా ఈ సారి కాస్త తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు.

శనగపచ్చ పురుగు సోకే ప్రమాదం



పూత నుంచి కాత దశకు పంట మారుతున్న తరుణంలో శనగపచ్చ పురుగు వచ్చే అవకాశం ఉంది. ఈ పురుగు పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. దీని నివారణకు ఫ్లూ బెండమైడ్ -39.35 శాతం ఎస్‌సి(నూనెమందు) ఎకరాలకు 20 నుంచి 40 మిల్లీ లీటర్లు 150 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే పురుగు ఉధృతి తగ్గుతుంది. ఫ్లూ బెండడైడ్ 20.0శాతం డబ్ల్యూడీజీ పొడిమందును ఎకరానికి 125గ్రామాలు 150 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 శాతం ఎస్‌జి ఎకరానికి 90 గ్రాములు, 150 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయవచ్చు. నొవాల్యూరాన్ 10ఈసీ మందు 200 మి.లీటర్లు 150 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. బుప్రోఫెజిన్ 25 శాతం ఎస్‌సి మందు 330 మి.లీటర్లు 150 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

-లక్ష్మీకుమారి, ఏడీఏ, పరిగి

సాగు ఆశాజనకంగా ఉంది



ఈ సారి రెండెకరాల్లో కంది పంట సాగు చేశా. పంట కూడా ఏపుగా పెరిగింది. ఇప్పటి వరకు బాగానే ఉంది. ఈ సారి పెద్దగా చీడపీడల బెడద లేదు. ముందు జాగ్రత్తగా మందును పిచికారి చేశా. ఒక వర్షం కురిస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

-గోలినాయక్, నజీరాబాద్, పరిగి మండలం

ఈ పంటపైనే ఆశలు పెట్టుకున్నా



ఖరీఫ్ సీజన్ చివర్లో అధిక వర్షాలకు పత్తి, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే ప్రస్తుతం కంది మాత్రం బాగుంది. పత్తి, మొక్కజొన్నలపై ఆశలు వదులుకున్నాం. కంది పంటపైనే నా ఆశలు. పంట పూతదశలో ఉంది. పురుగుల బాధ లేకపోయినా మందును పిచికారి చేశా. ఆశలన్నీ కందిపంటపైనే పెట్టుకున్నాం.

- ప్రదీప్‌రెడ్డి, సుల్తాన్‌పూర్, పరిగి మండలం

నేడు తాండూరుకు స్పీకర్ రాక

తాండూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నేడు తాండూరు పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన నున్నారు. ఆయనతో పాటు చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొంటరు. ఉదయం 10 గంటలకు మాతా శిశు సంక్షేమ ఆస్పత్రిలో ఇందిరా మహిళ శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటిన్ ప్రారంభిస్తారు. ఎస్‌వీఎస్ ఫంక్షన్ హాల్‌లో వివిధ పథకాలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులు స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. స్వయం శక్తితో వ్యాపార, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు యూనియన్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా జూట్ బ్యాగ్‌ల తయారీ ప్రోగ్రాంలో ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఈ శిక్షణ నేటి నుంచి 13 రోజుల పాటు కొనసాగనుంది. 19 నుంచి45 సంవత్సరాల వరకు ఉన్నవారు అర్హులని, ఆసక్తి కలవారు ఆధార్, రేషన్ కార్డులతో పాటు 3 ఫొటోలు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పిస్తారు. అనుమానాల నివృత్తి కోసం 9391487797, 9177141712, 9618534720, 6301890681, 9441728468 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.


నేల స్వభావాన్ని పరిశీలిస్తున్న డీఏవో మోహన్‌రెడ్డి

భావితరాలకు సారవంతమైన నేలను అందించాలి

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): భావితరాలకు సుస్థిరమైన, సారవంతమైన భూమిని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పరిగి మండలం నస్కల్ గ్రామంలో మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో అధిక రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకం వల్ల నేలలోని జీవరాశులు నశించిపోతున్నాయని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు, పిల్లిపెసర వేసి కలియదున్నడం ద్వారా నేల సారాన్ని పెంచవచ్చన్నారు. రైతులు మట్టి పరీక్షలు కచ్చితంగా చేయించుకోవాలని సూచించారు. వరికొయ్యలను కాలిస్తే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందనానరు. కార్యక్రమంలో పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి, ఏఈవో కావ్య, రైతులు దండు అశోక్, వెంకటయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


శంకర్‌పల్లి గురుకులంలో భోజనం చేస్తున్న వర్షిణి, యాదయ్య

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి వర్షిణి
- చేవెళ్ల ఎమ్మెల్యేతో కలిసి విద్యాలయాల సందర్శన

మొయినాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే భోజనంలో రాజీపడొద్దని, మెనూ ప్రకారం భోజనం అందించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి అలుగు వర్షిణి సూచించారు. గురువారం రాత్రి మొయినాబాద్ మండల పరిధిలోని శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాల, చిలుకూరు గురుకుల బాలుర పాఠశాలలను చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? ఇంకా ఏమైనా సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. భోజనం ఒక్కోసారి సరిగా ఉండటం లేదని, ఉదయం స్నానం చేయడానికి వేడినీళ్లు సరిగా రావడం లేదని, ల్యాబ్ సరిగా లేదని, ఎంసెట్, నీట్ కోచింగ్ ఇప్పించాలని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వర్షిణి మాట్లాడుతూ ఎలాంటి సమస్యలున్నా మా దృష్టికి తేవాలని చెప్పారు. చిలుకూరు గురుకులంలోని విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సత్యనారాయణ, నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, మహేందర్, రాజుగౌడ్, రమేశ్, రియాజ్ తదితరులు ఉన్నారు.


లచ్చంపేటలో పోలింగ్‌బూత్ కోసం భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

చౌదరిగూడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి, లచ్చంపేటలో పోలింగ్ బూత్‌ల నిర్వహణ కోసం పోలింగ్ స్టేషన్ భవనాలను పరిశీలించారు. వార్డుల వారీగా తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. ఎంపీవో హన్మంత్‌రెడ్డి, కార్యదర్శులు సౌజన్యరెడ్డి, సత్యనారాయణరెడ్డి, టీఏ లక్ష్మారెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.


కొందుర్గు : దివ్యాంగులకు నోట్‌బుక్స్ అందిస్తున్న అధికారులు

దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు

చౌదరిగూడ/మొయినాబాద్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాలు దివ్యాంగులకు అండగా నిలుస్తున్నాయని కొందుర్గు మండల ఎంపీడీవో లక్ష్మీఅనురాధ అన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఎమ్మార్సీ భవనంలో దివ్యాంగ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కొందుర్గు తహసీల్దార్ రమేష్‌కుమార్, ఇన్‌చార్జి ఎంఈవో గాయత్రీదేవి, జీహెచ్ఎం గోపీనాథ్, ఐఈడీ టీచర్ జయమ్మ, స్పెషలైజేషన్ టీచర్లు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. అలాగే దివ్యాంగ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మొయినాబాద్ మండలాభివృద్ధి అధికారి సంధ్య తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 'అంగవైకల్యం ఆటంకం కాదు' కార్యక్రమాన్ని మండల పరిధిలోని హిమాయత్ నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఎంపీడీవో ముఖ్యఅతిథిగా పాల్గొని దివ్యాంగ విద్యార్థులను సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇన్‌చార్జి ఎంఈవో వెంకటయ్య, అనురాధ, హెచ్ఎం ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఏవియేషన్ స్కిల్ డెవలప్‌మెంట్‌కు జీఎమ్మార్ ఎంవోయూ

- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): యువతకు ఏవియేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ పెంచేందుకు జీఎమ్మార్-హైదరాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్.. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో వివిధ విమానయాన శిక్షణ కార్యక్రమాలు, సర్టిఫికేషన్‌లు అందించనున్నట్లు జీఎమ్మార్ ప్రతినిధులు ప్రకటనలో పేర్కొన్నారు. శ్రామిక నైపుణ్యాలను బలోపేతం చేసేందుకు, విమానయాన పరిశ్రమలో పెరుగుతున్న డిమాండ్‌లకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించడం జరిగిందని యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తెలంగాణ వైస్ చాన్సలర్ వీఎల్‌వీఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు.

పాఠశాల భోజనంపై అనాసక్తి

ఇంటినుంచే తెచ్చుకుంటున్న విద్యార్థులు

మర్పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా లేదని విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకొని తింటున్నారు. ఓ వైపు మండల స్థాయి అధికారులు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీలు చేస్తుంటే క్షేత్రస్థాయిలో మార్పు మాత్రం కనిపించడం లేదు. మర్పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో కొన్ని రోజులుగా మధ్యాహ్న భోజనంలో అన్నం సరిగా


ఇంటి భోజనం తింటున్న విద్యార్థులు

లేదని, వండిన అన్నం ఉడికి ఉడకనట్లుగా ఉండటంతో తినేందుకు విద్యార్థులు ఆసక్తి కనబర్చడం లేదు. దీంతో వండిన అన్నంను పడేసి సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారు. దీంతో కొంత మంది విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చుకున్న ఆహారాన్ని తింటున్నారు. మరి కొంతమంది ఇళ్ల నుంచి టిఫిన్ తెచ్చుకోలేక, పాఠశాలలో తినలేక పస్తులు ఉండాల్సిన దుస్థితి. అన్నం నాణ్యతపై ప్రశ్నిస్తే బియ్యం సరిగా రావడం లేదని, ఎలా వండినా ఈ విధంగానే అవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు.

'భగీరథ' నీటినే తాగాలి

చేవెళ్ల/యాచారం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు మిషన్ భగీరథ నీటినే తాగాలని, ప్రాణాంతకమైన వ్యాధులు తెచ్చిపెడుతున్న ఆర్వో ఫిల్టర్ నీటిని ఎట్టి పరిస్థితుల్లో తాగవద్దని మిషన్ భగీరథ పథకం రంగారెడ్డి జిల్లా కార్యాలయం అధికారి, చేవెళ్ల ఇన్‌చార్జి రెడ్డిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో మిషన్ భగీరథ అధికారులు తాగునీటిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటింటికీ నల్లాల ద్వారా సరఫరా చేస్తున్న స్వచ్ఛమైన భగీరథ నీటిని



చేవెళ్ల : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు తదితరులు

మాత్రమే తాగాలని సూచించారు. ఏఈ గీతా స్రవంతి, జాహ్నవి, టెక్నీషియన్ హరికృష్ణ, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, ఎంపీటీసీ వసంతం, బీజేపీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు సమతారెడ్డి, నాయకులు నరోత్తంరెడ్డి, హెచ్ఎం గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే స్వచ్ఛమైన నీరు తాగాలని యాచారం మండల ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజు, ఏఈ సుభాష్ విద్యార్థులకు సూచించారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా గున్‌గల్, చౌదర్‌పల్లి, గడ్డమల్లాయగూడ తదితర గ్రామాల్లో తాగునీటి వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మినరల్ వాటర్‌కు దీటుగా ప్రభుత్వం మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకుల్లో బోరు వాటర్ కలిపి పంపిణీ చేయకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డీఈ, ఏఈలు మాల్, యాచారం, గున్‌గల్, చౌదర్‌పల్లి, చింతపట్ల తదితర పాఠశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు.


యాచారం : తాగు నీటి వాడకంపై మోడల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య


మేడ్చల్ జిల్లా తరఫున ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈమేరకు గురువారం నగరంలోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా బజార్‌లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ జిల్లాలో ఇందిరా మహిళా శక్తి ద్వారా చేపట్టిన ప్రగతి గురించి సీఎంకు వివరించారు. మహిళా శక్తిలో భాగంగా మండలానికో క్యాంటీన్, సంఘాలలో లేని 1,700 మందిని సంఘాలలోకి ఆహ్వానించడం తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు ముఖ్యమంత్రికి వివరించారు.

కలెక్టరేట్ వద్ద 2కే రన్

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్ వద్ద జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. జిల్లా అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా డీపీఎం, ఏపీఎంలతో కలిసి డీఆర్డీవో సమావేశం నిర్వహించి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలను వివరించారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి, కళాకారుల బృందాలు గురువారం ప్రజాపాలన కళాయాత్ర నిర్వహించారు. రెండు బృందాలు జిల్లాలోని గ్రామాలు, మున్సిపాలిటీల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. జీపీ, మున్సిపల్ కార్యాలయాలు, రద్దీ ప్రదేశాల వద్ద ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేపడుతున్నారు. కళాకారుల ఆటపాటలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నట్లు కళాకారులు తెలిపారు. ఈనెల 9వరకు కళాకారుల బృందాలు జిల్లాలో ప్రచారం చేపడుతారని డీపీఆర్వో తెలిపారు.

సీఎం కప్-2024కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

చౌదరిగూడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సీఎం కప్-2024 పోటీల్లో పాల్గొనే గ్రామీణ క్రీడాకారులు ఆధార్‌కార్డు, మొబైల్ తదితర వివరాలతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కొందుర్గు ఎంపీడీవో లక్ష్మీఅనురాధ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ పోటీల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీఎం కప్ పోటీలు మొదటగా గ్రామీణ స్థాయిలో నిర్వహించిన తర్వాత మండల, జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికచేస్తారని చెప్పారు. క్రీడాపోటీల్లో పాల్గొనేవారు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి వివరాలను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 7, 8న గ్రామస్థాయిలో.. 10 నుంచి 12వరకు మండలస్థాయి, 16 నుంచి 21వరకు జిల్లాస్థాయిలో సీఎం కప్ క్రీడాపోటీలు జరుగుతాయని తెలిపారు.

వార్డులవారీగా ఓటర్ల జాబితా సరిచూసుకోవాలి

త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు వార్డులవారీగా ఓటర్ల జాబితాను సరిచూసుకొని మిగిలిన వారి వివరాలు, డోర్‌లాక్, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి వివరాలను రికార్డుచేసి ఉంచుకోవాలని సూచించారు. ఏ ఒక్కరూ పేరు రాలేదనే ఫిర్యాదు రావొద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌కుమార్, ఇన్‌చార్జి ఎంఈవో గాయత్రీదేవి, ఏఎస్సై చత్రీయనాయక్, ఎంపీవో లాలయ్య వివిధ శాఖల అధికారులు,కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మీఅనురాధ

వీఆర్ఏల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తాం


షాద్‌నగర్ : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏలు

షాద్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏ వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని, వీఆర్ఏల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. గత ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన బ్యూరోక్రాట్స్ ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి కలెక్షన్ కింగ్‌లా మారారని విమర్శించారు. గురువారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన వీఆర్ఏలు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. శంకర్ మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తామన్నారు. 61 ఏళ్లు నిండిన వీఆర్ఏల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

కారోబార్ ఉద్యోగులను పర్మనెంట్ చేయండి

గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న కారోబార్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని కారోబార్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా జీతాలు పెంచాలని కోరుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైనా న్యాయం చేయాలని కోరారు.

పెద్దచెరువు సుందరీకరణకు డీపీఆర్

కేశంపేట : మండల పరిధిలోని పోమాల్‌పల్లి, కొండారెడ్డి గ్రామాల ఉమ్మడి పెద్దచెరువు సుందరీకరణకు సంబంధించిన డీపీఆర్‌ను ఎమ్మెల్యే శంకర్‌కు కొండారెడ్డిపల్లికి చెందిన పల్లె ఆనంద్‌కుమార్ అందించారు. పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్పలతో కలిసి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు డీపీఆర్ అందించి వివరించారు. ప్రైవేటు ఏజెన్సీతో సర్వే చేయించానని, పూర్తి వివరాలు డీపీఆర్‌లో పొందుపర్చారని తెలిపారు. ప్రాజెక్ట్ విలువ రూ.4కోట్ల50లక్షలుగా ఎస్టిమేషన్ వేసినట్లు వివరించారు. డీపీఆర్‌లో చెరువు కట్టను కలుపుతూ బ్రిడ్జి నిర్మాణం, చెరువు కట్ట విస్తరణం, బలోపేతం చేయాలని సూచించినట్లు వివరించారు. ఎమ్మెల్యే చెరువు సుందరీకరణకు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. బడ్జెట్ సమావేశాల్లో చర్చించి నిధులు తీసుకొస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భాస్కర్‌గౌడ్, కరుణాకర్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్, మనోహర్‌గౌడ్ పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో బస్తీ దవాఖాన

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ పట్టణంలోని పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం బస్తీ దవాఖాణాను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. షాద్‌నగర్ పాత వ్యవసాయ మార్కెట్ ఆఫీసును ఆధునీకరించి, బస్తీ దవాఖాణాను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైద్యారోగ్య శాఖ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రారంభోత్సవానికి తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ ఖాన్, వైద్యాధికారులు వినోద్, పూనమ్, అక్రమ్, శ్రీనివాస్‌లు ఉన్నారు.

కాగితాల్లోనే పార్కులు

పంచాయతీ, హెచ్ఎండీఏ లేఅవుట్లలో అన్యాక్రాంతం

- కమ్యూనిటీ హాళ్లకు, పార్కింగులకు వినియోగం
- 50 కాలనీల్లో 120 పార్కు స్థలాల గుర్తింపు



మేడ్చల్ పట్టణంలోని ఈద్గా సమీపంలో కబ్జాకు గురైన పార్కు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో దూసుకుపోతున్న మేడ్చల్ మున్సిపాలిటీలో కోట్ల రూపాయల విలువ చేసే పార్కు స్థలాలకు రక్షణ కరువైంది. పార్కు స్థలాలు రికార్డుల్లో ఉన్నా పొజిషన్‌లో మాత్రం పార్కు స్థలాల్లో ఇండ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు వెలిశాయి. పార్కు స్థలాలను కాపాడడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. గ్రామ పంచాయతీ, హెచ్ఎండీఏ లేఅవుట్లలో పార్కుల కోసం స్థలాలు వదిలినట్లు రికార్డు చేశారు. పట్టణంలో 50 కాలనీల్లోని పంచాయతీ, హెచ్ఎండీఏ వెంచర్లలో 120 పార్కులు ఉన్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అయితే, పార్కులు ఎక్కడున్నాయన్న విషయం కాలనీల్లో ఉండేవారికి కూడా తెలియదు. ముఖ్యంగా పంచాయతీ లేఅవుట్లలో పార్కు స్థలాలు కబ్జా చేశారని అధికారులు గుర్తించారు. ఆ స్థలాలనూ వెంచర్ నిర్వాహకులు ప్లాట్లుగా అమ్మేశారని ఆరోపణలు ఉన్నాయి.

పార్కు స్థలాలన్నీ కబ్జాలపాలే!

కాలనీల్లోని పార్కు స్థలాలను కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి, సొసైటీ కార్యాలయాలు, వాహనాల పార్కింగ్‌లకు వాడుకుంటున్నారు. పదేళ్ల కాలంగా మేడ్చల్‌లో చేపట్టిన హరితహారంలో భాగంగా పార్కు స్థలాలను గుర్తించి అక్కడ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినా చాలావరకు పార్కు స్థలాలను అలాగే వదిలేశారు. కొన్ని కాలనీల్లోని పార్కు స్థలాలను పరిసరాల్లో ఉన్న ప్లాట్లలో యజమానులు యథేచ్ఛగా భవనాలు నిర్మించుకున్నారు. లేఅవుట్ ప్రకారం పార్కు కోసం 400 చదరపు గజాల స్థలం వదిలినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. పొజిషన్‌లో మాత్రం 200 గజాల స్థలం కూడా కన్పించడం లేదు. పార్కుకు ఆనుకొని ఉన్న ప్లాట్ల యజమానులు దర్జాగా పార్కు స్థలంలో నిర్మాణాలు చేపట్టారన్న విషయం అధికారులకు స్పష్టంగా తెలుస్తున్నా వారి పట్ల చర్యలు తీసుకోవడం లేదు.

జాగాలను పరిరక్షిస్తున్నాం



పార్కు స్థలాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేసే చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ లేఅవుట్‌లోని పార్కు స్థలాలను గుర్తించి అక్కడ మొక్కలు నాటడం, పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు ఏర్పాటు చేస్తున్నాం. పార్కు స్థలాల్లో ఎవరైనా నిర్మాణాలు చేపడితే వాటిని తొలగిస్తాం. పరుల ఆధీనంలో పార్కు స్థలాలు ఉంటే వెంటనే స్వాధీనం చేసుకుంటాం.

- నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

పార్కు స్థలాలను కాపాడాలి



కాలనీల్లోని పార్కు స్థలాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలి. పార్కు స్థలాల్లో మొక్కలు నాటి పిల్లలు ఆడుకునేలా పరికరాలు ఏర్పాటు చేయాలి. జీపీలు, బస్తీలోని స్థలాల్లో దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి.

- మహబూబ్ అలీ, మేడ్చల్

స్థలాలు కబ్జా కాకుండా చూడాలి



పార్కు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలి. బస్తీల్లో పిల్లలు ఆడుకునేలా ఆట పరికరాలు ఏర్పాటు చేయాలి. పంచాయతీ, హెచ్ఎండీఏ లేఅవుట్ల ప్రకారం పార్కులకు వదిలిసిన స్థలాలను కచ్చితంగా గుర్తించి వాటికి హద్దులు ఏర్పాటు చేయాలి. ఒకవేళ వాటిల్లో ఇప్పటికే నిర్మాణాలుంటే కూల్చి పార్కు జాగాలను పరిరక్షించాలి. కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలి.

- నడికొప్పు నాగరాజు, మేడ్చల్



బియ్యం నాసిరకంగా ఉన్నాయని చూపిస్తున్న లబ్ధిదారు

రేషన్ బియ్యంలో రాళ్లు, పురుగులు

అధికారుల పర్యవేక్షణా లోపం!

మోమిన్‌పేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యంలో రాళ్లు, పురుగులు కనిపించడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని ఇజ్రాచిట్టెంపల్లిలో దాదాపు 250 రేషన్ కార్డులు ఉండగా.. ప్రతీ నెల 90 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. రేషన్ దుకాణం ద్వారా అందిస్తున్న బియ్యం తినేందుకు పనికిరావని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బియ్యంలో మట్టి, రాళ్లు, పురుగులు, నూకలతో నాసిరకంగా ఉంటున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని అడిగితే పై నుంచి వస్తున్నాయని, ఇష్టం ఉంటే తీసుకోండి.. లేదంటే తాము కొనుగోలు చేసి ఇవ్వలేమని డీలర్లు సమాధానం ఇస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ విషయమై రేషన్ డీలర్‌ను వివరణ కోరగా.. గోదాం నుంచి మంచి బియ్యమే వస్తున్నాయని, ఎక్కడో ఓచోట ఇలాంటి బియ్యం వస్తున్నాయని సమాధానమిచ్చారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన బియ్యం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



డిజిటల్ సభ్యత్వం ఇస్తున్న యాదిలాల్

టీడీపీతోనే సామాజిక న్యాయం

ఆమనగల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే సామాజిక న్యాయం, పేదలకు రాజ్యాధికారం సాధ్యమని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అండేకార్ యాదిలాల్ అన్నారు. తెలుగుజాతి ఉన్నంత వరకు టీడీపీ ప్రజల హృదయాల్లో ఉంటుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గురువారం టీడీపీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి యాదిలాల్ ప్రారంభించారు. తిమ్మరాశిపల్లిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు పర్వత్‌రెడ్డికి డిజిటల్ సభ్యత్వాన్ని అందజేశారు. అనంతరం సమావేశంలో యాదిలాల్ మాట్లాడుతూ టీడీపీకి తెలంగాణలో పూర్వవైభవం వస్తుందన్నారు. సభ్యత్వ నమోదును పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని ఆయన కోరారు. దేశ రాజకీయాల్లో టీడీపీ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని, కార్యకర్తలను నాయకులుగా, ప్రజా నేతలుగా తీర్చిదిద్ది దేశానికి అందించిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. ఏపీతో పాటు తెలంగాణ అభివృద్ధికి, కార్యకర్తల శ్రేయస్సుకు ఏపీ సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. నాయకులు తిమ్మయ్య, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాంత్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

కులాంతర వివాహాల చట్టం తేవాలి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కులాలు, మతాంతర వివాహాల చట్టం తీసుకురావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కె.భాస్కర్‌లు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి రాయపోల్ గ్రామంలో హత్యకు గురైన నాగమణి భర్త శ్రీకాంత్ కుటుంబాన్ని గురువారం సీపీఎం బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులాంతర వివాహం చేసుకుందనే కారణంతోనే నాగమణిని తన తమ్ముడు పరమేష్ హత్య చేశాడేగానీ.. ఆస్తి తగాదా కాదన్నారు. కులాంతర వివాహాల కారణంగా రాష్ట్రంలో అనేక హత్యలు జరిగాయిని.. ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగాకుండా శ్రీకాంత్ కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సామ్యేల్, యాదయ్య, జంగయ్య, బుగ్గరాములు, జగన్ తదితరులున్నారు.

విద్యుత్ వైర్లు తగిలి రైతు మృతి



రామకృష్ణారెడ్డి మృతదేహం

పూడూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్లు తగిలి రైతు మృతిచెందిన ఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం బార్లపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని రామచంద్రారెడ్డి పొలంలో కంది పంటకు మందు పిచికారీ చేస్తున్నారు. రామకృష్ణారెడ్డి(58), కొంగి నర్సింహులు, ఉలచల రామస్వామి ట్రాక్టర్ ద్వారా పిచికారీ చేస్తున్నారు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు రామకృష్ణారెడ్డికి విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. నర్సింహులు, రామస్వామికి గాయాలయ్యాయి. వెంటనే వారిని వికారాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణారెడ్డి కుమారుడు బుచ్చిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



యువజన కాంగ్రెస్ నేతలతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి యువజన కాంగ్రెస్ నేతలకు పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్‌కు ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ ఎన్నిక ప్రక్రియలో వివిధ పదవులకు ఎంపికైన నాయకులు గురువారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో యువనేతలు కష్టపడి పనిచేశారని గుర్తుచేశారు. కష్టపడి పనిచేసే నాయకులకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. యూత్ కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం అధ్యక్షుడు వెదిరె సికిందర్‌రెడ్డి, మంచాల మండలాధ్యక్షుడు రావుల రాఘవ, జయప్రకాష్, ఎండీ అబ్రహం, ప్రణీత్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దశరథ్

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

చేవెళ్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని, పనులు చేసే సోయి రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడంతోనే నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం చేవెళ్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలూరు గేట్‌వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు చనిపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు విస్తరణ పనులు చేయించాలనే ఆలోచనే ఎమ్మెల్యే యాదయ్యకు లేదని ఆరోపించారు. ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళ్లే దమ్ము లేదా? అని ప్రశ్నించాడు. ఇప్పటికైనా ప్రభుత్వం పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆసిఫ్, నరేష్, పృథ్వీ, తేజ, సుదర్శన్ తదితరులున్నారు.

కొడంగల్ సమగ్రాభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ

- రూ.1200 కోట్లతో ప్రతీ గ్రామానికి డబుల్ రోడ్డు
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రాంత సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ముందుకు వెళ్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తెలిపారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేడు(శుక్రవారం) పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలను రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా చేపట్టనున్నట్లు తెలిపారు. హరేరామ హరేకృష్ణ ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 27 వేలకుపైగా విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు కిచెన్ షెడ్డును ప్రారంభించనున్నట్లు తెలిపారు. దాంతోపాటు నియోజకవర్గంలో రూ.60 కోట్లకుపైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు చెప్పారు. అందులో కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.15 కోట్లు, నూతన మండలాలు కొత్తపల్లి, గుండుమాల్, దుద్యాల మండల కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి రూ.26 కోట్లతో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతీ గ్రామం, తండాలకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.1200 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు నందారం ప్రశాంత్, నర్సిములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కటకం శివకుమార్ గుప్తా, నాయకులు రాంచంద్రారెడ్డి, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీని తలపిస్తున్న కాంగ్రెస్ పాలన

- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న జైపాల్ యాదవ్

కడ్తాల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న బీఆర్ఎస్ నాయకులపై ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంబిస్తూ అక్రమ కేసులు బనాయిస్తోందని, ప్రజాపాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. రాజకీయ దురుద్దేశం, కుట్ర పూరితంగా బీఆర్ఎస్ నేతలను ఇబ్బందులకు గురిచేస్తే ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయక తప్పదన్నారు. మండల కేంద్రంలో గురువారం ప్రభుత్వ పాలన తీరుపట్ల నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో జైపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిదాలను, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్‌పై దాడులకు ఎగబడిందన్నారు. హామీలు అమలు చేయలేదని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. రాష్ట్రంలో అడుగడుగునా రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కౌశిక్ రెడ్డి అరెస్టులను ఖండించారు. బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొందరు పోలీసు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నేతల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని.. అది సరికాదని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రేవంత్ రెడ్డి సర్కార్ దుర్మార్గ పాలన సాగిస్తోందన్నారు. మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు జోగు వీరయ్య, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు లాయక్‌అలీ, రమేశ్, నర్సింహ, పాండు, బాలకృష్ణ, జైపాల్, సేవ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

దిశ లేని బతుకులు

(3వ పేజీ తరువాయి)

ఇవ్వలేని అమాయక తల్లిదండ్రులు... ఇక్కడ సీన్ కట్ చేస్తే 2019 డిసెంబరు 6న 'దిశ' ఘటనలో ఎన్‌కౌంటర్.. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని చటాన్‌పల్లి దగ్గర సీన్ రీకన్‌స్ట్రక్షన్ సందర్భంగా జరిగిన ఘటన ఇది... నారాయణపేట జిల్లా జక్లేర్‌కు చెందిన ఆరిఫ్, గుడిగండ్లకు చెందిన జొల్లు శివ, చింతకుంట కేశవులు, జొల్లు నవీన్‌కుమార్ పోలీసు కాల్పుల్లో మృతి చెందారు.

ఈ ఘటనలో ఎవరిది తప్పు, ఎంతవరకు అన్నది కోర్టు పరిధిలోని అంశం. కానీ, ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబాలు మాత్రం ఆదరువు కావాల్సిన కుమారులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. వారికి దిశ చూపే వారికోసం ఎదురు చూస్తున్నాయి. సంఘటన జరిగి ఐదేళ్లు గడిచిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' గురువారం గుడిగండ్ల, జక్లేర్ గ్రామాల్లోని బాధిత కుటుంబాలను కలిసి మాట్లాడి వారి స్థితిగతులను తెలుసుకుంది. వివరాలు వారి మాటల్లోనే...

మా కుటుంబాన్ని ఆదుకోవాలి



ఎన్‌కౌంటర్ పేరుతో మా కుమారుడు జొల్లు నవీన్‌కుమార్‌ను పోలీసులు అకారణంగా చంపేశారు. మా కుమారుడు తప్పు చేసి ఉంటే శిక్ష వేయడానికి కోర్టులు ఉన్నాయి. కానీ, ఎవరో చేసిన తప్పుకు మా పిల్లవాడ్ని బలిచేశారు. ఎన్‌కౌంటర్ చేసి ఐదేళ్లు అవుతున్నా.. ఇప్పటి వరకు అతీగతీ లేదు. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ పేరుతో ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులను కఠినంగా శిక్షించి మా కుటుంబానికి న్యాయం చేయాలి.

- లక్ష్మి, జొల్లు నవీన్‌కుమార్ తల్లి

వృద్ధాప్యంలో ఆదుకునేవారు లేరు



దిశ ఎన్‌కౌంటర్‌తో ఉన్న ఒక్కగానొక్క కుమారుడ్ని (ఆరిఫ్) కోల్పోయాం. ప్రస్తుతం మేము నివసించే పెంకుటిల్లు శిథిలావస్థలో ఉంది. మాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. దినసరి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. బూటకపు ఎన్‌కౌంటర్‌తో మా కుమారుడ్ని పొట్టన పెట్టుకున్నారు. ఇంత వరకు మాకు ఎలాంటి సహాయం అందించలేదు. వృద్ధాప్యంతో ఆదుకునేవారు లేరు. ఇప్పటికైనా ప్రభుత్వం మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

- ఆరిఫ్ తల్లిదండ్రులు మౌలాన్‌బీ, హుస్సేన్, జక్లేర్

కొడుకుపై బెంగతో మా ఆయన చనిపోయాడు



బూటకపు ఎన్‌కౌంటర్‌తో మా కుమారుడు జొల్లు శివను పొట్టనపెట్టుకున్నారు. కుమారుడు మరణించాడనే దిగులుతో మా ఆయన కూడా మృతి చెందాడు. నాకు కనీసం వితంతు పింఛన్ కూడా రావడం లేదు. వృద్ధాప్యం కారణంగా కూలి పనులు సైతం చేసుకోలేక ఇబ్బంది పడుతున్నాను. ఉండేందుకు ఇల్లు లేకపోవడంతో రేకుల షెడ్‌లో నివాసం ఉంటున్నాను.

- జొల్లు శివ తల్లి మణెమ్మ, గుడిగండ్ల



ఐక్యత చాటుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాదిగలంతా ఐక్యంగా ముందుకు సాగాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ మాదిగ

తలకొండపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతి ఉద్ధరణ, హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి మాదిగలంతా రాజకీయాలకతీతంగా ఐక్యంగా ముందు కు సాగాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికారి ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తీసుకునే నిర్ణయానికి మాదిగలంతా కట్టుబడి ముందుకు సాగాలని కోరారు. తలకొండపల్లి మండలం కేంద్రంలో గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించగా కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సదస్సు విజయవంతంపై చర్చించారు. ఆత్మీయ సమ్మేళనం విజయవంతం ద్వారా మాదిగల ఐక్యతను చాటాలని కోరారు. అదేవిధంగా మాల సోదరుల స్వార్థ కుట్రలకు రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గి వర్గీకరణ చేయకుండా మొండివైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. దండోరా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు మాదిగలంతా సంఘటిత శక్తిగా నిలువాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జంగయ్య, వీరస్వామి, మబ్బు సాయిలు, రామరాజు, జ్యోతయ్య, యదయ్య, మల్లేశ్, కృష్ణ, కిరణ్, శ్రీకాంత్, కుమార్, మహేశ్, విజయ్, రాజు, నారాయణ, జంగయ్య, సంపత్, సంజీవ, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

వైద్యవృత్తికి వన్నె తేవాలి

- చైతన్య డీమ్డ్ వర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వైద్య రంగాల్లో పనిచేసే వారిని దైవాలుగా ఆరాధిస్తారని, ఈ వృత్తికి, కోర్సులకు వన్నెతెచ్చేలా పనిచేయాలని, మానవతా విలువలు పాటిస్తూ మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేయాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ పురుషోత్తంరెడ్డి విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో గల చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో ఫార్మసీలో అడ్మిషన్ తీసుకున్న సందర్భంగా విద్యార్థులకు స్వాగతంగా ఏర్పాటు చేసిన వైట్ కోట్ సెర్మనీ కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ వైద్యరంగానికి అనుబంధంగా నిలిచే ఫార్మసీ విద్యను విలువలతో అభ్యసించాలని తెలిపారు. విద్యాభ్యాసం పూర్తయ్యాక మానవతా విలువలు పాటిస్తూ మెరుగైన వైద్యాన్ని అందించాలని విద్యార్థులకు సూచించారు. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్విక రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, డీన్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆచార్య శంకర్ లింగం, సుందర్‌రావు, జీవన్‌చంద్ర, పీఆర్వో గాదె రాంబాబు విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో డాక్టర్ పురుషోత్తంరెడ్డి తదితరులు

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ యెగానందం అన్నారు. అనురాగ్ యూనివర్సిటీలో గురువారం స్కూల్ అఫ్ ఫార్మసీ ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకెవీవై 4.0) పరిధిలో ఉన్నతి నైపుణ్య శిక్షణ ధృవీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమంలో మొదటి బ్యాచ్ నేటి నుంచి 8 వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్స్‌పెక్టర్ శివదేవ్, ఫార్మసీ డీన్ వసుధభక్తి, బాబాశంకర్, వెంకటేశ్వరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత మెరుగైన పాలన

మేడ్చల్ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మేడ్చల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డులో గురువారం వీధులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ జాకట దేవరాజ్, కమిషనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగిని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుతాం

పరిగి: పరిగిని స్వచ్ఛపట్టణంగా తీర్చిదిద్దుతామని పరిగి మునిసిపల్ ఛైర్మన్ ఎం.అశోక్ అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. గురువారం పరిగి పట్టణంలో పలుకాలనీల్లో పిచ్చి మొక్కలు, డ్రైనేజీని శుభ్రం చేయించారు. పారిశుధ్య కార్మికులతో నిరంతరం కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, ఎంఈవో గోపాల్ పాల్గొన్నారు.

కొనసాగిన రిలేనిరాహార దీక్షలు

ఘట్‌కేసర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెన నిర్మాణపనులను త్వరగా పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఐదో రోజు దీక్షలో స్థానిక ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కూర్చున్నారు. ఈదీక్షకు పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు. ఘట్‌కేసర్‌లోని కొండాపూర్ రైల్వేగేట్ వద్ద నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణ పనులు గత 15ఏళ్లుగా కొనసాగడం వలన ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

భూ సార పరీక్షలు చేయించాలి

బొంరాస్‌పేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చేయించాలని ఏడీఏ శంకర్‌రాథోడ్, వ్యవసాయ అధికారిణి తులసి అన్నారు. ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా గురువారం తుంకిమెట్ల, బొంరాస్‌పేట్ రైతు వేదికల్లో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఎకరా భూసార పరీక్షకు రూ.10చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక్కో గ్రామంలో వందకు మంది భూసార పరీక్షలకు ముందుకు వస్తే వ్యవసాయ శాస్త్రవేత్తలు వచ్చి మట్టి నమూనాలు సేకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక


సభ్యత్వ నమోదు రసీదులను స్వీకరిస్తున్న విక్రమ్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోడీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులలై స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారని బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి అన్నారు. జిల్లాలో క్రియాశీల సభ్యత్వ నమోదు రసీదులను గురువారం ఆయన స్వీకరించారు. యువకులు, మహిళలలతో పాటు అన్నివర్గాల ప్రజలు తమ పార్టీలో అంచనాకు మించి సభ్యత్వం చేయించారని పార్టీ నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోహన్ రెడ్డి, జగన్నాథ్, ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌దాస్ వంశీ పాల్గొన్నారు.

చెత్తశుద్ధి ఏది?

● నిరుపయోగంగా ఎరువుల తయారీ కేంద్రాలు ● గ్రామాల్లో కానరాని స్వచ్ఛత


చిట్లపల్లి గ్రామశివారులో యార్డు దుస్థితి

కొడంగల్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ఉత్పత్తయ్యే చెత్తను ఒకచోట చేర్చి స్వచ్ఛతను పెంపొందించడమే కాకుండా దానిని ఎరువుగా మార్చి ఆయా పంచాయితీలకు ఆదాయాన్ని అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఆయా గ్రామాల్లో చెత్త నిల్వ కేంద్రాలను నిర్మించింది. అయితే ప్రస్తుతం ఎరువుల తయారీ కేంద్రాలు పలుచోట్ల నిరుపయోగంగా మారాయి. ఆదాయ వనరులే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేసి డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు విభజన షెడ్లు నిర్మించారు. తడి చెత్తతో ఎరువు తయారు చేసి, పొడి చెత్తను రీసైక్లింగ్‌కు విక్రయిండం వాటి ప్రధాన ఉద్దేశం. నిధుల లేమి, ఇతర కారణాలతో గ్రామ పంచాయితీలల్లో వాటి నిర్వహణ భారంగా మారడంతో డంపింగ్ యార్డులన్నీ నిరుపయోగంగా మారాయి.

ఒక్కో కేంద్రానికి రూ.2.50లక్షలు

కొడంగల్ మండలంలో 26గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్తనిల్వ కేంద్రాలు నిర్మించారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఉపాధిహామీ పథకంలో ఒక్కోదానికి రూ.3లక్షల వరకు ఖర్చు చేశారు. ట్రాక్టర్లు చెత్తసేకరణకు ప్రతీ ఇంటికి బుట్టలు ఇచ్చారు. డంపింగ్ యార్డుల నిర్వహణ మండలంలో ఒకట్రెండు పంచాయతీలకే పరిమితమైంది. అవగాహన లోపంతో ప్రజలు తడి, పొడి చెత్తను ఒకే బుట్టలో వేసి ఇవ్వడం, ట్రాక్టర్ల నిర్వహణ, కూలీల కొరత తదితర కారణాలతో చెత్తను కేంద్రాలకు తరలించే ప్రక్రియను పంచాయతీలు నిలిపివేశాయి.

ఊరికి దూరంగా ఉండటంతో..

ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. నిధుల కొరతతో పంచాయతీ ట్రాక్టర్ల నిర్వహణ ఆర్థికంగా భారంగా మారింది. చిన్న పల్లెలో నాలుగైదు రోజులకోసారి చెత్త సేకరిస్తున్నారు. దీనికితోడు కొన్ని చోట్ల డంపింగ్ యార్డులకు దారులు లేకపోవడం, చెత్త నిల్వ కేంద్రం ఊరికి దూరంగా ఉండటంతో దగ్గరలో ఉన్న గుంతల్లో, పాడుబడిన బావులు, దారుల వెంట చెత్తను పడేస్తున్నారు.

ఆసక్తి ఉన్నా ఆడించే వారేరీ?

(3వ పేజీ తరువాయి)

క్రీడాకారులుగా తీర్చిదిద్దడం ఎంతో అవసరం. కాగా, ఉన్నత చదువుల వైపు వెళ్లే ఇంటర్ చదివే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడల్లో శిక్షణ ఇచ్చే ఫిజికల్ డైరెక్టర్లు లేక విద్యార్థులు కేవలం చదువులకే పరిమితమవుతున్నారు. నియామకాలు, పదోన్నతులు లేని కారణంగా పీడీ పోస్టులు ఖాళీగా వెక్కిరిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 77 జూనియర్ కళాశాలు ఉండగా, వాటిలో 13 ప్రభుత్వ, 10 బీసీ సంక్షేమ, 10 కేజీబీవీ, 9 మోడల్, 6 సాంఘిక సంక్షేమ, 6 గిరిజన సంక్షేమ, 2 టీఎస్ఆర్‌జేసీ, 6 మైనార్టీ గురుకుల, 15 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి.

ప్రోత్సహించేవారు కరువు

జిల్లాలో కొడంగల్, తాండూరు, దోమ, నవాబ్‌పేట్, వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఉండగా, ఆ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. మిగతా ఎనిమిది కళాశాలలకు ఇంకా పీడీ పోస్టులు మంజూరు కాలేవు. ఫలితంగా పాఠశాల స్థాయి వరకు వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు చదువులతోనే సరిపెట్టుకుంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో రాణించాలని తపన ఉన్నా.. శిక్షణ ఇచ్చే.. ప్రోత్సహించే వారు లేక విద్యార్థులు చదువులతోనే కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. .

ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

దశాబ్ద కాలంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లు లేకపోవడం గమనార్హం. ఇంతకు ముందు పనిచేసిన ఫిజికల్ డైరెక్టర్లు బదిలీలపై ఇతర జిల్లాలకు వెళ్లగా, కొందరు ఉద్యోగ విరమణ చేశారు. ఫిజికల్ డైరెక్టర్లు లేక క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని పక్కన పెట్టాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ల నియామకానికి సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవ తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే


సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

యాలాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన యాలాల మండలంలోని పేర్కంపల్లి, అగ్గనూరు, అక్కంపల్లి, జుంటుపల్లి తదితర గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యాలాల అధ్యక్షుడు నర్సిరెడ్డి, పీఎస్‌పి ఛైర్మన్ సురేందర్ రెడ్డి, కరణం పురుషోత్తంరావు, అక్బర్‌బాబా, బాల్‌రెడ్డి, భీమప్ప, అనంతయ్య, వెంకటయ్య, హన్మంతు, శ్రీధర్, అమృతయ్య, సత్యనారాయణరెడ్డి, వీరేశం, తహసీల్దార్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునే విధంగా ప్రభుత్వం కృషిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రతాప్‌సింగారంలోని జిల్లా పరిషత్ పాఠశాలను గురువారం ఆయన సందర్శించి మౌలికసదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని సీసీపుటేజీల పనితీరు, నూతనంగా ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యయుడు రవికుమార్, నాయకులు బద్దం కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా అంకుశాపూర్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలను టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ గురువారం సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట సామగ్రిని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు వడ్డించే మెనులో మార్పులు ఉండకూడదని, నాసిరకమైన భోజనం పెడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, ఏఎంసీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలుకూరి మశ్చేందర్‌రెడ్డి, శివకుమార్‌గౌడ్, మహేష్‌గౌడ్, రాజేష్, ముత్యాల్ యాదవ్, జంగయ్యయాదవ్, సంజీవరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ రూరల్: పాఠశాలలో సీసీ పుటేజీ స్క్రీన్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ గురువారం తనిఖీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఘట్‌కేసర్ ప్రాథమికోన్నత పాఠశాలతోపాటు ఎన్ఎఫ్‌ఏసీ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో భోజనాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు నిత్యం బోజన ఏర్పాట్లు తనిఖీ చేసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని ఆదేశించారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని పాఠశాలల్లోనూ మధ్యాహ్న భోజనాన్ని ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి తనిఖీచేసి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మర్పల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ మునీరొద్దీన్, ఎంపీడీవో రాజమల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నం మెత్తగా ఉండటంతో అధికారులు నిర్వాహకులను ప్రశ్నించారు. బియ్యం సరిగా లేవని సమాధానం ఇవ్వడంతో మండలంలోని ప్రతీ పాఠశాలకు ఒకే రోజు బియ్యం సరఫరా అయ్యాయని, ఇదే పాఠశాలలో ఎందుకు ఇలా అవుతుందన్నారు. పాఠశాలకు మరో రకం బియ్యాన్ని పంపించేలా చూస్తామని, ఆ అన్నం కూడా ఇదే విధంగా అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బొంరాస్‌పేట్: జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు పరిశీలించారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుకర్, బాల్‌రాజ్, వెంకటయ్య, బాకారం మల్లయ్య, బాకారం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో పట్టణానికి చెందిన గిరీష్ కొఠారి స్వామి గురువారం నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. రవి పంతులు ఆధ్వర్యంలో భజన, అయ్యప్ప స్వాములు పేటతుళ్లి ఆడారు. కార్యక్రమంలో కార్తీక్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సంస్కృతి టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి నామినేషన్

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ప్రస్తుత అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాదరావు గురువారం మరోసారి నామినేషన్ వేశారు. ఈనెల 22న జరిగే ఎన్నికలకు నేడు మరికొంత మంది నామినేషన్లు వేసే అవకాశం ఉంది. 22న ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఎన్నికలు, సాయంత్రం 4గంటలకు ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వాహణ కమిటీ పాల్గొంది.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

నవాబుపేట/మోమిన్‌పేట్: నవాబుపేట మండలంలోని భవిత కేంద్రంలో ఇఇఆర్‌పీ మురళీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో అబ్దుల్ రెహెమాన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, కవిత, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో గురువారం విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ వైస్ ఛైర్మన్, డైరెక్టర్ పదవికి రాజీనామా

ధారూరు: ధారూరు పీఏసీఎస్ వైస్ ఛైర్మన్, డైరెక్టర్ పదవులకు డి.రాజునాయక్ రాజీనామా చేశారు. ఈమేరకు గురువారం ఆయన రాజీనామా లేఖను సంఘం పాలకవర్గానికి అందజేశారు. అనివార్య కారణాల వల్ల వైస్‌ఛైర్మన్, డైరెక్టర్ పదవులకు రాజీనామా చేసినట్లు రాజునాయక్ తెలిపారు. రాజునాయక్ రాజీనామాను పాలవర్గంతో కలిసి ఏకగ్రీవంగా ఆమోదించినట్లు పీఏసీఎస్ ఛైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి, సీఈవో కే.నర్సింహులు ప్రకటించారు.

మైనార్టీలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం శోచనీయం

నవాబుపేట: కాంగ్రెస్ ప్రభుత్వంలో మైనారిటీలకు మంత్రి పదవీ ఇవ్వకపోవడం శోచనీయమని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ హాయంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించడం జరిగిందన్నారు.

వెంకటయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

బొంరాస్‌పేట్: ఇటీవలే గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ పాత్రికేయుడు వెంకటయ్య కుటుంబానికి కాంగ్రెస్ అండగా నిలిచింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అందించిన రూ.2లక్షల 50వేల ఆర్థికసాయాన్ని గురువారం వారి కుటుంబసభ్యులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు.

బీఎంపీ మహాసభను విజయవంతం చేయాలి

పరిగి: ఈ నెల 18 నుంచి 22 వరకు బీహార్‌లోని బోధ్‌గయాలో జరిగే భారత్‌ముక్తి మోర్చా జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని బీఎంపీ జిల్లా అధ్యక్షుడు పి.గట్యానాయక్ కోరారు. ఈ సభలకు సంబంధించి గురువారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, నాయకులు హరినాయక్, రవీందర్, బాబ్యా తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

కొడంగల్ రూరల్: దుద్యాల మండలంలోని హస్నాబాద్‌లో లబ్ధిదారులకు గురువారం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు భీమయ్య సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. కోస్గి చిన్న మొగులప్పకు రూ.97,500, బొంగు శాంతమ్మ రూ.లక్ష, దత్తు సాయమ్మకు రూ.50వేలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, రాజు, అనిల్‌గౌడ్, సురేష్, హన్మంతు, దత్తు, సుక్కప్ప, నరేష్, అశోక్ తదితరులు ఉన్నారు.

గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం

కులకచర్ల: చౌడాపూర్ మండల గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. గురువారం సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శశిధర్, గౌరవ అధ్యక్షుడిగా రాందాస్, ప్రధాన కార్యదర్శిగా సురేశ్, అసోసియేట్ అధ్యక్షుడిగా గోపాల్, ఉపాధ్యక్షుడిగా హరిప్రసాద్, కార్యదర్శిగా సంతోష్, ప్రధాన కార్యదర్శిగా ధారసింగ్, సాంస్కృతికకార్యదర్శిగా శివరాం ఎన్నికయ్యారు.

క్రైం కార్నర్

వివాహిత అదృశ్యం


సంపూర్ణ

తాండూరు రూరల్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన మ్యాతరి శ్రీను ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం శ్రీను ట్రాక్టర్ నడిపేందుకు వెళ్లగా భార్య సంపూర్ణ వీడియో కాల్ చేసి మాట్లాడింది. రాత్రి 8.30గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూడగా సంపూర్ణ ఇంట్లో కనబడలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త శ్రీను పోలీసులను ఆశ్రయించాడు.

ఘట్‌కేసర్‌లో ఇంటర్ విద్యార్థి..

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్లిన ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం. కీసర మండలం బోగారం గ్రామానికి చెందిన దుర్గం అయిలయ్య కుమారుడు శివకుమార్(16) ఘట్‌కేసర్ పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 4వ తేదీన ఉదయం ఇంటి నుంచి కళాశాలకు బయలేదేరివెళ్లాడు. అదేరోజు మధ్యాహ్నం కళాశాలకు తండ్రి అయిలయ్య ఫోన్‌చేయగా శివకుమార్ రాలేదని చెప్పారు. బుధవారం ఉదయం 9.30గంటలకు బోగారంకు చెందిన బాలరాజు బైక్‌పై లిఫ్టు ఇచ్చి ఘట్‌కేసర్ బస్టాండ్ వద్ద వదిలేసినట్లు తెలిపారు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో తండ్రి గురువారం రాత్రి ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బల్దియా అక్రమాలపై చర్యలు తీసుకోవాలి


కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కాపీని చూపిస్తున్న కౌన్సిలర్ సంగీత ఠాకూర్

తాండూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కౌన్సిలర్ సంగీత ఠాకూర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ సుధీర్‌లను కలిసి తాండూరులో మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలలుగా ఛైర్‌పర్సన్ సమావేశాలు నిర్వహించకుడా నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ నిర్వహించకుండా కాలయాపన చేస్తూ మున్సిపాలిటీలో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ జేసీబీ ఏమైందని కమిషనర్‌ను ప్రశ్నించారు. వార్డుల్లో, మురికి కాల్వలను శుభ్రం చేయకుండా కాలయాపన చేస్తూ జేసీబీ లేదని కల్లబొల్లి కబుర్లు చెబుతూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ జేసీబీలను అద్దెకు తీసుకుని ఇష్టానుసారంగా బిల్లులు చెల్లిస్తూ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని అన్నారు. ఛైర్‌పర్సన్, కమిషనర్ ఇద్దరూ కుమ్మక్కై మున్సిపాలిటీ నిధులు అన్నింటినీ ఖాళీ చేస్తున్నారని ఆమె వివరించారు.

బీఆర్ఎస్ నేతల అరెస్టుపై ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డిలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య తెలిపారు. ఆయన గురువారం వికారాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. వెంటనే బీఆర్ఎస్ నాయకులను విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ పూర్తి


తాండూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వందశాతం పూర్తయిందని ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. ఆయన గురువారం సర్వే నమోదుపై మాట్లాడారు. డాటా ఎంట్రీలో జిల్లాలోనే తాండూరు మండలం ముందు వరుసలో ఉందన్నారు. మండలంలోని 33పంచాయతీల్లో 8 అనుబంధ గ్రామాల్లో సర్వే చేపట్టగా, 15,600 కుటుంబాల సర్వే చేయగా, 15,251 కుటుంబాల వివరాలు ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. మిగతా 400 కుటుంబాలు డోర్‌లాక్ ఉన్నట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ పెద్దేముల్ మండలంలో డాటా ఎంట్రీ వెనుకబడి ఉన్నందున ఎంపీడీవోకు ఎంట్రీ చేయించే బాధ్యతలు అప్పగించారు. గురువారం 13 కంప్యూటర్ల ద్వారా తమ కార్యాలయంలో సిబ్బందిని నియమించి డేటా ఎంట్రీ చేయిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

నవాబుపేట: మండలంలో కులగణన సర్వేను పూర్తి చేసినట్లు ఎంపీడీవో అనురాధ తెలిపారు. మండలంలోని 12662ఇళ్లను గుర్తించి వందశాతం డాటా ఎంట్రీని పూర్తిచేసినట్లు తెలిపారు. మండలంలోని డోర్ లాక్ 15 ఇళ్లు, మూలమాడలో ఒకరు సర్వే చేయించుకోని వారు ఉన్నారని తెలిపారు. మొత్తం 12579ఇళ్లను ఎన్యూమరేటర్లు సర్వే చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

కులకచర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి తండాకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.కోటీ 65లక్షలు ఎమ్మెల్యే మంజూరు చేయించారు. మంగళవారం రాత్రి పనులకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండలంలోని చెరువు ముందలి తండా(ఏ)లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తండా నాయకులు శ్రీనివాస్‌నాయక్, రవీందర్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా జగదీశ్వర్


జగదీశ్వర్

మర్పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో మర్పల్లికి చెందిన జగదీశ్వర్ 729ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తనపై నమ్మకంతో ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించిన యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని జగదీశ్వర్ తెలిపారు.

యూత్ కాంగ్రెస్ మున్సిపాలిటీల అధ్యక్షుల ఎన్నిక

మేడ్చల్ టౌన్: ఆన్‌లైన్ ఓటింగ్ పద్ధతిలో కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా నిర్వహించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల ఎన్నికల్లో గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడిగా నవీన్ ముదిరాజ్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడిగా రాకేష్ ఎన్నికయ్యారు. యువకులను పార్టీలో సభ్యత్వం కల్పించి వారితో ఆన్‌లైన్ పద్ధతిలో ఓటు వేసి ఎన్నుకునే వీలును కాంగ్రెస్ పార్టీ కల్పించింది. దీంతో యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకుని గుండ్లపోచంపల్లి నుంచి నవీన్ ముదిరాజ్, మేడ్చల్ నుంచి రాకేష్‌లను ఎన్నుకున్నారు.